JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । మంగళవారం 19-05-2026
Medchal - Malkajgiri । Tuesday 19-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 352
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 352 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




## కేరళం సీఎంగా సతీశన్

- **రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం**

**జయభేరి, తిరువనంతపురం, మే 18 :**

కేరళం కొత్త సీఎంగా వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. సతీశన్ చేత రాష్ట్ర గవర్నర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రయాంక గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. సీఎంతో పాటు 20 మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో IUML నుంచి 5గురు, జోసెఫ్ కేరళ కాంగ్రెస్, జాకబ్ కేరళ కాంగ్రెస్, RSP, CMP నుంచి ఒక్కొక్కరు ఉన్నారు.కేరళలో పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికార పగ్గాలు చేపట్టింది. నేడు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ...మిగతాది 2 లో

## ట్రంప్ ప్రకటనతో.. రూపాయి ధమాల్



'ఇరాన్ కోసం అమెరికా ఎదురుచూస్తోంది. పరిస్థితి మరింత దిగజారకూడదంటే ఇరాన్ వేగంగా చర్యలు తీసుకోవాలి. చర్చల ద్వారా ఒప్పందం చేసుకుంటే వారికే మంచిది. లేకపోతే ప్రపంచ పటంలో వారి జాడ లేకుండా చేస్తాం. సమయం చాలా తక్కువగా ఉందని, ఇరాన్ త్వరగా మేల్కోవాలని' ట్రంప్ తాజాగా హెచ్చరించారు.

**జయభేరి, న్యూఢిల్లీ, మే 18 :**

భారత కరెన్సీ విలువ చరిత్రలో ఎన్నడూ లేనంతగా దిగజారిపోయింది. సోమవారం నాడు వారంలోని మొదటి ట్రేడింగ్ రోజున అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి కనిష్ట స్థాయికి పడిపోయింది. మే 18న భారత రూపాయి అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 96.17 వద్ద చారిత్రాత్మక కనిష్ట స్థాయికి పడిపోయింది. ట్రేడింగ్ సమయంలో కొంత సమయం పాటు ఒక డాలర్‌కు భారత రూపాయి 96.18 పడిపోయింది. ఇది మునుపటి క్లోజింగ్ ధర కంటే దాదాపు 0.2 శాతం కంటే తక్కువ. ఈ క్షీణతతో గత రికార్డు కనిష్ట స్థాయి ధర 96.1350ని కూడా నేటి ట్రేడింగ్‌లో దాటింది.భారత్ తన అవసరాలలో దాదాపు 85 శాతం ముడి చమురును ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటుందని తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 111 డాలర్లకు చేరడంతో భారత దిగుమతి వ్యయం భారీగా పెరుగుతుంది. దాంతో భారత చమురు దిగుమతిదారులు చెల్లింపులు చేయడానికి మరిన్ని డాలర్లు అవసరం అవుతాయి. మార్కెట్‌లో డాలర్లను కొనుగోలు చేయడానికి డిమాండ్ పెరిగినప్పుడు, రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే వేగంగా తగ్గడం ప్రారంభమవుతుంది. ...మిగతాది 2 లో



## మోడీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం

**జయభేరి, న్యూఢిల్లీ, మే 18 :**

ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. ప్రపంచ నాయకులకు స్వీడన్ అందించే అత్యున్నత పురస్కారం 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' ఆయనకు లభించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ప్రధాని మోదీ అద్భుతమైన నాయకత్వ పటిమకు ఈ పురస్కారం ఒక నిదర్శనమని చంద్రబాబు కొనియాడారు. అంతర్జాతీయంగా భారత భాగస్వామ్యాలను, ప్రపంచ దేశాలతో సహకారాన్ని బలోపేతం చేయడానికి మోదీ నిరంతరం చేస్తున్న కృషిని ఈ అవార్డు ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు.విశేషమేమిటంటే, ఇది ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ ప్రస్థానంలో అందుకున్న 31వ అంతర్జాతీయ పురస్కారం అని చంద్రబాబు వెల్లడించారు. ప్రపంచ వేదికపై భారతదేశ ఖ్యాతిని పెంచడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు.

## పోలవరం ఎడమ కాల్వ చంపావతి లింక్ పై అధ్యయనం



- **ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల పనులు**
- **గత పాలకుల నిర్వాకం వల్ల నిర్వీర్యమైన లిఫ్ట్ స్కీంలు**
- **ఖరీఫ్ కు నీరిచ్చే అంశం పై జలవనరుల శాఖకు దిశానిర్దేశం**

**జయభేరి, విజయవాడ, మే 18 :**

ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర సచివాలయంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ...మిగతాది 2 లో




## నెల రోజుల పాటు జెండా పండుగ

- **అత్యధికం పసుపు రంగంలో టీఆర్ఎస్ జెండా డిజైన్**
- **రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఒకే విధమైన బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకురావడమే లక్ష్యం**

**జయభేరి, హైదరాబాద్, మే 18 :**

హైదరాబాద్ వేదికగా తెలంగాణ రక్షణ సేన పార్టీ తన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక అడుగు వేసింది. పార్టీ అస్తిత్వానికి ప్రతీకగా భావించే అధికారిక జెండా గద్దె నమూనాను ఆ పార్టీ అధినేత్రి కవిత ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఒకే విధమైన బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించిన ఈ సరికొత్త డిజైన్ అత్యధికంగా పసుపు రంగులో ఉండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ గడ్డపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించే దిశగా తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. పార్టీ కోర్ కలర్‌గా పసుపు రంగును ఎంచుకున్న ఈ పార్టీ, తాజాగా తన అధికారిక జెండా గద్దె నమూనాను విడుదల చేసింది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, పోరాట పటిమను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ గద్దెలు, రానున్న రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలానికి ...మిగతాది 2 లో



## మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

**జయభేరి, న్యూఢిల్లీ, మే 18 :**

పశ్చిమ ఆసియా (మధ్యప్రాచ్యం) ప్రాంతంలో నెలకొన్న తీవ్ర యుద్ధ వాతావరణం అంతర్జాతీయంగా ముడి చమురు సరఫరాను దెబ్బతీస్తోంది. దీని ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరుగుతుండటంతో, భారతదేశంలోని ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు (HPCL, BPCL, IOCL) తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను తదుపరి సారి ఎప్పుడు సవరించనున్నారు అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం సోమవారం కీలక ప్రకటన చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన ధరల తదుపరి సవరణ ఎప్పుడు జరుగుతుందో ఇప్పుడే ఖచ్చితంగా అంచనా వేయలేమని కేంద్రం స్పష్టం చేసింది. పశ్చిమ ఆసియా సంక్షోభం వల్ల దేశీయంగా తలెత్తే పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం ఒక అంతర్‌మంత్రిత్వ శాఖల ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశం అనంతరం పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయంగా మారుతున్న పరిస్థితులను తాము నిశితంగా గమనిస్తున్నామని చెప్పిన ఆమె, రాబోయే రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలలో ఎలాంటి అదనపు పెంపు ఉంటుంది అనేదానిపై ఇప్పుడే ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వలేమని తేల్చి చెప్పారు. అయితే, ధరల పెంపు ఎలా ఉన్నప్పటికీ దేశంలో ఇంధన కొరత వచ్చే ప్రమాదం ఏమాత్రం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ...మిగతాది 2 లో

## నక్సల్స్ రహిత రాష్ట్రంగా నిలిపిన పోలీసులకు అమిత్ షా సత్కారం



**జయభేరి, జగదల్పూర్:**

తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చడంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. దేశంలో నక్సలిజం నిర్మూలనకు విశేష కృషి చేసిన భద్రతా బలగాల త్యాగాలు, సేవలను గుర్తించేందుకు ఈ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీసు విభాగం నుంచి డీజీపీ సి.వి. ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ & గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతిలతో పాటు ఎస్ఐబీ (ఇంటెలిజెన్స్) బృందాన్ని అమిత్ షా ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి ...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## కేరళం సీఎంగా సతీశన్

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సతీశన్‌తో పాటు మరో 20 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు రమేశ్ చెన్నితాల, కే. మురళీధరన్, ఏపీ అనిల్ కుమార్‌లకు స్థానం లభించింది. అలాగే, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్ కూడా కేబినెట్‌లో చేరారు. మిత్రపక్షాల నుంచి ఐయూఎంఎల్ సీనియర్ నేత పీకే కున్హాలికుట్టి, ఆర్ఎస్పీ నేత షిబు బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నేత మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకబ్) నేత అనూప్ జాకబ్ వంటి ప్రముఖులు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ వేడుకకు వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

**రాజకీయ ప్రత్యర్థికి హోం శాఖ.. సతీశన్ సంచలనం**

కేరళ రాజకీయాల్లో ఓ అరుదైన పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్, అత్యంత కీలకమైన హోం శాఖను తన వద్ద ఉంచుకోకుండా పార్టీలోని తన రాజకీయ ప్రత్యర్థిగా పేరున్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కేటాయించారు. ఇది పార్టీలో అంతర్గత విభేదాలకు ముగింపు పలికి, సమన్వయంతో ముందుకు సాగాలనే సంకేతాలను ఇస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని చెన్నితాల ధ్రువీకరించారు. "పదేళ్ల తర్వాత యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన ఈ రోజు కేరళ ప్రజలకు శుభదినం. ప్రజలకు సుపరిపాలన అందించడం మా కర్తవ్యం. నేను హోం శాఖ బాధ్యతలు చేపట్టబోతున్నాను" అని ఆయన తెలిపారు.

**స్పష్టమైన ఆధిక్యంతో యూడీఎఫ్ విజయం**

ఈ నెల 4న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో యూడీఎఫ్ కూటమి అద్భుత విజయం సాధించింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలకు గాను యూడీఎఫ్ 106 సీట్లు గెలుచుకుంది. ఇందులో కాంగ్రెస్ పార్టీకి 63, దాని ప్రధాన మిత్రపక్షానికి 22 సీట్లు దక్కాయి. మరోవైపు, అధికారంలో ఉన్న వామపక్ష కూటమి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) కేవలం 35 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయం చవిచూసింది. సీపీఎం 26, సీపీఐ 8 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి. దేశంలో వామపక్షాలు అధికారంలో ఉన్న చివరి రాష్ట్రమైన కేరళలో కూడా అధికారం కోల్పోవడం గమనార్హం.

**పవన్ శుభాకంక్షలు**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేరళ నూతన ప్రభుత్వానికి సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కేరళ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వీడీ సతీశన్‌కు, అలాగే ఆయనతో పాటు మంత్రివర్గంలో కొలువుదీరిన మంత్రులందరికీ అభినందనలు అందజేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, కేరళంలో కొలువుదీరిన నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పారదర్శకమైన, ప్రగతిశీలమైన సుపరిపాలనను అందిస్తూ కేరళంను మరింత అభ్యుదయ పథంలోకి తీసుకెళ్లాలని కోరారు. 'దేవుని సొంత దేశం'గా ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఖ్యాతి గడించిన కేరళం రాష్ట్రం, ఈ నూతన నాయకత్వంలో సరికొత్త అభివృద్ధిని, అపార సుసంపన్నతను సాధించాలంటూ పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు

## రూపాయి ఢమాల్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో ఇలా పోస్ట్ చేశారు. 'ఇరాన్ కోసం అమెరికా ఎదురుచూస్తోంది. పరిస్థితి మరింత దిగజారకూడదంటే ఇరాన్ వేగంగా చర్యలు తీసుకోవాలి. చర్చల ద్వారా ఒప్పందం చేసుకుంటే వారికే మంచిది. లేకపోతే ప్రపంచ పటంలో వారి జాడ లేకుండా చేస్తాం. సమయం చాలా తక్కువగా ఉందని, ఇరాన్ త్వరగా మేల్కోవాలని' ట్రంప్ తాజాగా హెచ్చరించారు. ట్రంప్ తాజా వార్నింగ్ ప్రకటన కారణంగా ప్రపంచ పెట్టుబడిదారులు రిస్క్ తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. దాంతో భారత స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లు తమ డబ్బును వెనక్కి తీసుకుని సేఫ్ అని భావించే అమెరికన్ డాలర్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈ కారణంగా భారత రూపాయిపై ఒత్తిడి మరింత పెరుగుతోంది. భారత కరెన్సీ రూపాయి బలహీనపడితే, విదేశాలలో విద్య నుంచి వైద్య చికిత్స వరకు ఎన్నో విషయాలు మరింత ఖరీదు అవుతాయి. టిక్కెట్లు లేదా ట్యూషన్ ఫీజులు చెల్లించడానికి ఎక్కువ డాలర్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. రూపాయి బలహీనపడితే, భారత్‌లోకి దిగుమతి చేసుకునే మొబైల్, ఆటోమొబైల్ భాగాలు, ల్యాప్‌టాప్‌లు, ల్యాప్‌టాప్ భాగాలు మరింత ఖరీదు అవుతాయి. డాలర్ మరింత ఖరీదు అయితే దేశంలో రవాణా ఖర్చు పెరుగుతుంది. దీనివల్ల నిత్యావసర వస్తువులతో పాటు పలు ఉత్పత్తుల ధర క్రమంగా పెరుగుతుంది.

## మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

అధికారికంగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు భరోసా ఇచ్చింది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ సిలిండర్లు మరియు సహజ వాయువుల నిల్వలు తగినంత మొత్తంలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. అన్ని రకాల నిత్యావసర ఇంధనాల సరఫరా దేశవ్యాప్తంగా ఎక్కడా ఆగకుండా సాధారణంగానే సాగుతుందని, కాబట్టి ఎల్‌పీజీ పంపిణీదారులు, పెట్రోల్ బంకుల నిర్వాహకులు లేదా సామాన్య వినియోగదారులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ప్రభుత్వం కోరింది. గత పరిణామాలను పరిశీలిస్తే, అంతర్జాతీయ ఒత్తిడి కారణంగానే గత శుక్రవారం దేశవ్యాప్తంగా పెట్రోల్ మరియు డీజిల్ ధరలను లీటరుకు రూ. 3 చొప్పున కేంద్రం పెంచిన విషయం తెలిసిందే. ఈ సవరణ తర్వాత, దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 94.77 నుండి రూ. 97.77కు చేరుకోగా, డీజిల్ ధర లీటరుకు రూ. 87.67 నుండి రూ. 90.67కు పెరిగింది. కేవలం పెట్రోల్, డీజిల్ మాత్రమే కాకుండా రవాణా రంగంపై ప్రభావం చూపే సీఎన్‌జీ ధరలను కూడా ఢిల్లీ, ముంబైతో సహా పలు ప్రధాన నగరాల్లో కిలోకు రూ. 2 చొప్పున పెంచాల్సి వచ్చింది. ప్రస్తుతం అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతిన్నప్పటికీ దేశీయ మార్కెట్ సురక్షితంగా ఉందని సుజాత శర్మ పునరుద్ఘాటించారు. దేశంలో ఇంధన లభ్యత పుష్కలంగా ఉందని, కాబట్టి ప్రజలు అనవసర కంగారుతో ఒకేసారి ఇంధనాన్ని కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ ఆసియా సంక్షోభం ప్రారంభమై ఇప్పటికే రెండున్నర నెలలు దాటిపోయిందని, ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన 'హోర్ముజ్ జలసంధి'లో ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదన్న నిజాన్ని ఆమె అంగీకరించారు. అయినప్పటికీ, మన దేశీయ రిఫైనరీలు ఎటువంటి అంతరాయం లేకుండా పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, భవిష్యత్తు అవసరాలకు సరిపడా ముడి చమురు నిల్వలు భారతదేశం వద్ద సిద్ధంగా ఉన్నాయని వివరించారు. చివరగా, అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం ఎంతకాలం కొనసాగినా దేశంలో అంతర్గత సరఫరా దెబ్బతినకుండా ఉండేందుకు చమురు మంత్రిత్వ శాఖ అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుందని జాయింట్ సెక్రటరీ తెలిపారు. అదే సమయంలో, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఆమె పౌరులకు సూచించారు. గ్యాస్ సిలిండర్లకు ప్రత్యామ్నాయంగా పైప్డ్ నేచురల్ గ్యాస్, ఇండక్షన్ స్టవ్‌లు, మరియు ఎలక్ట్రిక్ కుక్‌టాప్‌ల వంటి ఆధునిక వంట పద్ధతులను అలవాటు చేసుకోవడం ద్వారా ఇంధన పొదుపు చేయవచ్చని ఆమె దేశ ప్రజలను ప్రోత్సహించారు.

## పోలీసులకు అమిత్ షా సత్కారం

మాట్లాడుతూ.. దేశంలో లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజం (వామపక్ష తీవ్రవాదం)ను పూర్తిగా తుడిచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 2026 మార్చి 31 నాటికి దేశాన్ని నక్సలిజం మహమ్మారి నుంచి పూర్తిగా విముక్తి చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలోనే దశాబ్దాలుగా నక్సల్స్ అడ్డాగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని 'బస్తర్' ప్రాంతాన్ని ఇప్పుడు నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఒక చారిత్రాత్మక మైలురాయి అని కొనియాడారు. నక్సలిజం కారణంగా ఎన్నో ప్రాంతాలు అభివృద్ధికి దూరమై, హింసతో యువత భవిష్యత్తు అంధకారంలో పడిపోయిందని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు మూడు తరాల పాటు దేశాన్ని పట్టిపీడించిన ఈ సమస్యకు ముగింపు పలకడం వెనుక భద్రతా సిబ్బంది చేసిన త్యాగాలు వెలకట్టలేనివని ప్రశంసించారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణతో పాటు నక్సల్ ప్రభావిత రాష్ట్రాల సమిష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

# ఒకప్పుడు అప్రతిహతం.. నేడు హతం!



దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కామ్రేడ్లు.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం.1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్‌అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది.పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనకు నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి.

ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది. కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమా లకు పెట్టింది పేరుగా ఈ పార్టీ ప్రాభవం దక్కించుకుంది.

గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూ నిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి.నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా..నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి.కనీసంలో కనీసం పది మంది అయినా.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కనిపిస్తారు. అలా ఒకప్పుడు ప్రాభవాన్ని సంతరించుకున్న పార్టీ, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చింది. నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది.ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంధాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది.చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది."దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటమే మూలం.సైద్ధాంతిక గందరగోళం మధ్య సరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది. సీపీఐ నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సీపీఎం పార్టీ అవతరించింది.

సీపీఐకి చంద్ర రాజేశ్వరరావు, నల్లమల్ల గిరి ప్రసాద్, సీపీఎంనకు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి దిగ్గజాలు నేతృత్వం వహించారు. కమ్యూనిస్టు పంథా విషయంలో తిరిగి సీపీఎం పార్టీలో తలెత్తిన విబేధాల మూలంగా 1967లో మరో చీలికకు దారితీసి 'నక్సల్ బరీ 'గ్రామంలో తలెత్తిన తిరుగుబాటుతో (భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీ ,సీపీఐ(ఎంఎల్) గా ఉనికిలోకి వచ్చింది.బెంగాల్ నక్సల్బరీ రైతాంగ ఉద్యమం విభేదాలలోనే చారుమజుందార్, కానూ సన్యాల్, వినోద్ మిశ్రా లాంటి నేతలు నక్సలైట్ ఉద్యమానికి బాటలు వేశారు. ఆంధ్రప్రదేశ్ లో దేవులపల్లి వెంకటేశ్వరరావు,తరిమల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి,పైలా వాసుదేవరావు, కొండపల్లి సీతారామయ్య లాంటి నేతలు పనిచేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో నిజానికి 1948 నుండే చీలికలు మొదలయ్యాయి. 1948లో శిబ్దాశ్ ఘోష్ విడిపోయి వేరే పార్టీని ఉద్యమాలను నిర్మించారు. అది నేటికీ బలమైన ట్రేడ్ యూనియన్ గా జాతీయ స్థాయిలో కొనసాగుతుంది. నేటికి కూడా కమ్యూనిస్టులు అనేక చీలికలు పేలికలు కావడంతో వారి ఉద్యమాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనే సీపీఐ ఎంఎల్ లో అనేక చీలికలు కనిపిస్తాయి. జనశక్తి, ప్రజాపంథా, ప్రతిఘటన, ప్రజాప్రతిఘటన, లిబరేషన్, న్యూడెమోక్రసీ, మావోయిస్టు పార్టీ యూసీసీఆర్ఐ ఎంఎల్ ఇలా చెప్పుకుంటూ పోతే పదుల సంఖ్యలో చీలికలుగా కమ్యూనిస్టు పార్టీ ముక్కలుచెక్కలైంది.నేడు వివిధ పార్టీలుగా , గ్రూపులుగా ఉన్నప్పటికీ వారంత కమ్యూనిస్టు వారసులే అని పేర్కొనవచ్చు. రష్యా, చైనా తదితర తమ్యూనిస్టు దేశాలు కూడా మార్కెట్ ఎకానమీలో భాగమై ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్, నెహ్రూ, లోహియా , కమ్యూనిస్టులు ఎంతో ఆశలు పెట్టుకున్న నేషనలైజేషన్ స్థానంలో యూ టర్న్ తీసుకొని ప్రపంచీకరణ పేరిట ప్రయివేటీకరణ ముందుకు సాగుతున్న దశ. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో తిరిగి పన్నెండు, పద్నాలు గంటల పని విధానం చాపకింది నీరులా ముందుకు వస్తున్నది. సంఘటిత శక్తుల్లో నీరసం ఆవహించింది. వందేళ్లలో ఊహించని వారెందరో ఆర్థిక వ్యవస్థలో ఎదిగి రాజకీయాలను నిర్దేశిస్తున్నారు. కార్మిక వర్గాన్ని సమిష్టి పారిశ్రామిక వర్గంగా ఎదిగించాలనే ఆలోచన చేయకపోవడం వల్ల కమ్యూనిస్టు లకు సొంత వనరులు , సొంత లాబీలు తగ్గి పోయాయి. కమ్యూనిస్టు పార్టీలకు అనేక ఆంక్షలు ఉన్నా శ్రామికుల సమ్మెలు, రైతాంగ ఉద్యమాలలో పార్టీ గ్రూపులు పనిచేస్తూనే వస్తున్నాయి.

## జెండా పండుగ

నిదర్శనంగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపేలా అధినేత్రి కవిత ఒక భారీ కార్యాచరణను ప్రకటించారు. పార్టీ జెండా ఎగురవేసే ప్రతి చోటా ఒకే విధమైన ప్రమాణాలు ఉండాలని కవిత స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు నిర్మించే ప్రతి జెండా గద్దె ఒకే విధమైన కలర్ కోడింగ్, నిర్దేశిత డిజైన్ ను కలిగి ఉంటుందని వెల్లడించారు. తెలంగాణ నలుమూలలా ఎక్కడ జెండా గద్దెను చూసినా అది తెలంగాణ రక్షణ సేనదే అని ప్రజలు గుర్తించేలా ఏకరూపతను పాటిస్తాం అని ఆమె పేర్కొన్నారు. ఈ వినూత్న బ్రాండింగ్ వ్యూహం ద్వారా పార్టీకి ఒక శక్తివంతమైన విజువల్ ఐడెంటిటీని తీసుకురావాలని నాయకత్వం భావిస్తోంది. సరికొత్త నిర్మాణ శైలిని మరియు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు మే 20వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జెండా పండుగ నిర్వహిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ నెల రోజుల పాటు ప్రతి పల్లెలో, ప్రతి వార్డులో పండుగ వాతావరణంలో పార్టీ జెండాలను ఆవిష్కరించనున్నారు. ఈ పండుగ ద్వారా నిద్రాణంగా ఉన్న క్యాడర్‌ను యాక్టివ్ చేయడంతో పాటు, కొత్త సభ్యులను పార్టీలోకి ఆహ్వానించడానికి ఈ వేదికను ఉపయోగించుకోనున్నారు. తెలంగాణ రాజకీయాల్లో పసుపు రంగుకు ఒక చారిత్రక ప్రాధాన్యత ఉంది. ఇప్పుడు అదే రంగును తమ పార్టీ జెండాగా మలచుకుని, తెలంగాణ రక్షణ సేన రేపటి రాజకీయ పోరుకు సిద్ధమవుతోంది. కేవలం జెండా ఆవిష్కరణకే పరిమితం కాకుండా, పార్టీ గద్దె వద్ద నిరంతరం ప్రజా సమస్యలపై చర్చలు జరిగేలా చూడాలని కవిత పిలుపునిచ్చారు. ఈ సరికొత్త వ్యూహం ద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు తామే అసలైన వారసులమని చాటిచెప్పాలని టీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది .తెలంగాణ రక్షణ సేన వేస్తున్న ఈ అడుగులు ఇతర ప్రధాన రాజకీయ పార్టీల్లో కూడా ఆసక్తిని రేపుతున్నాయి. జెండా పండుగ ముగిసే నాటికి రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో పార్టీ ఉనికిని చాటడమే కాకుండా, రాబోయే ఎన్నికలకు బలమైన పునాది వేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం. పసుపు రంగు జెండాతో తెలంగాణ నలుమూలలా ఒక బలమైన ముద్ర వేయాలని కవిత నేతృత్వంలోని టీఆర్ఎస్ నాయకత్వం కృతనిశ్చయంతో ఉంది.

## చంపావతి లింక్ పై అధ్యయనం

సమీక్షించారు. దీంట్లో భాగంగా ఇరిగేషన్ క్యాలెండర్ అంశంపై చర్చించారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులు కాకుండా...ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులు కూడా చేపట్టాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఆ మేరకు ఆ 11 ప్రాజెక్టులను ఇరిగేషన్ క్యాలెండరులో చేర్చాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను సూచించారు. గతంలో ప్రకటించిన 25...సమీక్షలో ప్రకటించిన 11 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా తీసుకుని ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్ కు అనుగుణంగా పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశం సందర్భంగా పోలవరం సహా వివిధ సాగు నీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సివిల్ వర్క్స్ 88 శాతం పూర్తి అయ్యాయని అధికారులు వెల్లడించారు. భూసేకరణ 93 శాతం పూర్తైందని...నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి డయాఫ్రాం వాల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. ఎడమ కాలువ అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్ పనులను చేపడుతున్నట్టు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు.. వివిధ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. హంద్రినీవా ఫేజ్ 1 లో భాగంగా కాలువల వెడల్పు 92 శాతం పూర్తి అయ్యిందని అధికారులు చెప్పారు. ఫేజ్ 2 కుప్పం పుంగనూరు కాలువల లైనింగ్ 85 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మల్యాల లిఫ్ట్ నుంచి రాయలసీమ ప్రాంతానికి తొలిసారిగా 52 టీఎంసీల నీటిని తరలించామని చెప్పారు. మొత్తంగా 432 చెరువులు పూర్తిగా నింపామని వెల్లడించారు. జూన్ 2024 నుంచి ఇప్పటి వరకూ రూ.2123 కోట్లు వ్యయం చేశామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రతీ నెలా పోలవరం పనుల పురోగతిపై సమీక్షిస్తాను. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1,2 పనులు చెప్పిన సమయానికి పూర్తి చేయాల్సిందే. ఈ ఏడాది జూలై నెల నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువ నుంచి నీరు అందివ్వాలి. ఎడమకాలువ నీరు మేఘాద్రిగడ్డకు పోలవరం జలాలు తీసుకువెళ్లాక అక్కడి నుంచి వంశధారనాగావళిచంపావతి వరకూ నీరు వెళ్లేలా చూడాలి. మేఘాద్రి గడ్డ నుంచి చంపావతి లింక్ కు ఎంత వ్యయం అవుతుందో అధ్యయనం చేయాలి. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలి. 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపును పూర్తి చేయాలి. ఎలాంటి వివాదాలు లేకుండా ఆర్ అండ్ ఆర్ వేగంగా పూర్తి కావాలి. పోలవరం స్పిల్ వే దిగువన ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. బెస్ట్ టూరిజం ప్రాంతంగా పోలవరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కావాలి."అని సీఎం సూచించారు.

"వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ జూలై నాటికి పూర్తి కావాలి. హెడ్ వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూసేకరణ లాంటి పనుల కోసం ఇంకా రూ. 2019 కోట్లు అవసరం. టీబీఎంను తొలగించి అడ్డంకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ బ్యాలెన్సు పనులు వేగంగా పూర్తి కావాలి. అడవిపల్లి, శ్రీనివాసపురం నుంచి నీవా కాలువ ద్వారా చిత్తూరుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. హంద్రీ నుంచి నీవా వరకూ నీళ్లు తీసుకెళ్లేలా ప్రాధాన్యతగా తీసుకుని పనులు పూర్తి కావాలి. నీళ్లు చూస్తే ప్రజల్లో ఓ నమ్మకం వస్తుంది. మైదుకూరు, మడకశిర లాంటి చివరి ప్రాంతాలకు నీళ్లు వెళ్లాలి. నీవాకు ఈ ఏడాది నీరు ఇచ్చేలా లక్ష్యం పెట్టుకోవాలి. కల్యాణి డ్యామ్ నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా మూలపల్లి చెరువుకు నీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ పనులు వచ్చే ఏడాది జూలై నాటికి పూర్తి కావాలి. వరికెపుడిశెలను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంపాక్ట్ స్టడీ చేయాలి. అంతరాష్ట్ర సమస్యలు లేకుండా ప్రాజెక్టులు పూర్తి చేసుకుందాం. నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయమై కేంద్రంతో మాట్లాడదాం. గోదావరికావేరి అనుసంధానం పైనా కేంద్రంతో సంప్రదింపులు జరుపుదాం."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

"ఎల్ నినో లాంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు అంచనాలను సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలి. నెల్లూరు సాగు తీరును మార్చేలా చర్యలు తీసుకోవాలి. ఈసారి రెయిన్ ఫాల్ మైనస్ 3 శాతంగా ఉంది. భూగర్భ నీటి నిల్వలు 9.49 మీటర్లుగా ఉన్నాయి..గతేడాదితో పోలిస్తే 0.5 మీటర్లు ఎక్కువ ఉంది. ప్రస్తుత నీటి వనరుల్ని నింపేలా స్ట్రక్చర్ల నిర్మాణం జరగాలి. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉండాలి. మైక్రో ఇరిగేషన్ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. నీటి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. జలధారజలహారతి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలి. ప్రస్తుతం వ్యవసాయం కోసం సుమారు రూ. 17 వేల కోట్ల మేర విద్యుత్ ఖర్చులను భరిస్తున్నాం. భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ వినియోగం తగ్గుతుంది. అప్పుడు ప్రభుత్వంపై విద్యుత్ భారం కూడా తగ్గుతోంది. అందుకే నీటి భద్రతకు ప్రాధాన్యమిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. 2014, 19 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం లిఫ్ట్ స్కీంలకు అవసరమైన కేటాయింపులు జరిపేదని...అలాగే మరమ్మత్తులకు తగినన్ని నిధులు వెచ్చించే వాళ్లని అధికారులు తెలిపారు. అయితే 2019, 24 మధ్య కాలంలో లిఫ్ట్ స్కీంలకు ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు జరపలేదని అధికారులు సీఎంకు వివరించారు. దీని వల్ల సుమారు 362 లిఫ్ట్ స్కీంలు నిర్వీర్యం అయ్యాయని అధికారులు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. లిఫ్ట్ స్కీంలను పునరుద్దరించే అంశంపై చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రస్తుతం 156 లిఫ్ట్ స్కీంలు సంపూర్ణంగా... 505 స్కీంలు పాక్షికంగా పని చేస్తున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. లిఫ్ట్ స్కీంలను గాడిలో పెట్టేలా పని చేయాలని సీఎం సూచించారు. గతంలో సుమారు 10 లక్షల ఎకరాలకు లిఫ్ట్ స్కీంల ద్వారా సాగునీటిని అందించే పరిస్థితి ఉండేదని సీఎం గుర్తు చేశారు. అలాంటి వ్యవస్థలు నిర్వీర్యం కాకూడదని... వీటిని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుందని సీఎం అన్నారు. ఈ సమీక్ష సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, జలవనరులు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పాలమూరు ప్రాజెక్టుపై స్పందించండి

- మంత్రి జూపల్లి కృష్ణారావుకు పాలమూరు పెండింగ్ ప్రాజెక్టుల సాధన కమిటీ విజ్ఞప్తి..
- వినతి పత్రాన్ని అందజేసిన జేఏసీ నాయకులు

జయభేరి, షాద్ నగర్, మే 18 :



పాలమూరు ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పందించాలి. ప్రజలకు నేటి సౌకర్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరిన జేఏసీ నాయకులు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులపై వెంటనే స్పందించి సాగునీటి సమస్యలు తీర్చాలని, ఉమ్మడి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని "మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన కమిటీ" నాయకులు జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందించారు. జేఏసీ నాయకులు రాజేందర్ రెడ్డి, రాఘవాచారి, బెక్కెం జనార్ధన్, చెన్న కిష్టయ్య, టీజీ శ్రీనివాస్ వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగానికి తీవ్రంగా నష్టం చేసే డిండి లిఫ్టు రద్దుచేసి ప్రత్యామ్నాయంగా నాగార్జునసాగర్ బొట్టుముక్కల లెఫ్ట్ పనులు చేపట్టాలని, 72 జీవో అమలు చేయాలని కోరారు. ఇప్పటివరకు జిల్లాలో చేపట్టిన అన్ని సాగునీటి పథకాలను పూర్తిచేయాలని, ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులను వెంటనే చేపట్టి రైతుల సాగినీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వివిధ సంఘాలలో పనిచేసిన తమ బృందమంతా ఇటీవల సమావేశమై జిల్లాలో సాగునీటి పరిస్థితుల గురించి చర్చించి ప్రాజెక్టుల సాధన జేఏసీగా సాగునీటి సాధనకు కృషి చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు జిల్లాలో ప్రాజెక్టుల పరిశీలన నిర్వహించడం జరిగిందన్నారు. బూర్గుల రామకృష్ణారావు తర్వాత జిల్లా నుంచి ముఖ్యమంత్రిగా ఎన్నికైన రేవంత్ రెడ్డికి సాగునీటి విషయమై సమస్యను దృష్టికి తీసుకువచ్చేలా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు సభ్యులకు లేఖలు రాసినట్లు వివరించారు. ఇందులో భాగంగానే జిల్లా మంత్రికి కూడా వినతిపత్రం అందజేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యంగా మొదలైన తెలంగాణ ఉద్యమంలో రైతులు అధిక శాతం పాల్గొన్నారు. రాష్ట్ర సాధన జరిగితే తమ హక్కులు సాధించుకోవచ్చని ఆశించారని గుర్తు చేశారు. కానీ తెలంగాణ వచ్చి పుష్కరకాలం అవుతున్నప్పటికీ ఇప్పటిదాకా రైతుల ఆశలు నెరవేరలేదని పేర్కొన్నారు. ఉన్న వనరులను ప్రజలకు అందించే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లు గడిచిన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని, ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి ఆలస్యం చేయకుండా శరవేగంగా పనులు పూర్తి చేసి ప్రజలకు మేలు చేయాలని జేఏసీ నాయకులు పేర్కొన్నారు.




## యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ సీటు బెల్టు

- వాహనంలో ప్రతి ఒక్కరూ సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలి : యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ యలగొండ కృష్ణ

జయభేరి, యాదగిరిగుట్ట, మే 18 :

యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక డ్రైవ్ గా సీటు బెల్ట్ ఉపయోగాలు వాహనదారులకు తెలిపారు. డ్రైవింగ్ చేసే సమయంలో సీటు బెల్ట్ పెట్టుకున్నట్లయితే ప్రమాదం జరిగినప్పుడు ఎయిర్ బ్యాగ్ ఓపెన్ అవుతుందని దాని ఫలితంగా ప్రమాద తీవ్రత నుండి బయటపడవచ్చు అని యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ యలగొండ కృష్ణ వాహనదారులకు తెలిపారు. లక్షలు పెట్టి కార్లు కొన్న సీటు బెల్టు ఉపయోగించుకుంటే ప్రమాదాల తీవ్రత ఎక్కువగా జరుగుతుందన్నారు. అదేవిధంగా వాహనంలో ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని తెలపడం జరిగింది. ఎవరైతే సీటు బెల్టు పెట్టుకోకుండా ప్రయాణిస్తున్నారో వారికి జరిమానా కూడా విధించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, కానిస్టేబుల్ సలీం, హనుమంతు, వెన్నెల, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ ప్రాజెక్టు కాలువల ద్వారా పలు చెరువులు నింపేందుకు ప్రణాళికలు



జయభేరి, తుర్కపల్లి, మే 18 :

తుర్కపల్లి మండలంలోని కొండాపురం గ్రామం నుండి వెళ్తున్న కొండ పోచమ్మ సాగర్ కాల్వను సోమవారం నీటి పారుదల శాఖ డీఈ నాగరాజు, ఏఈ లావణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండాపురం గ్రామం నుండి తిరుమలపురం, వీరారెడ్డిపల్లి గ్రామాల చెరువులను కాలువల ద్వారా నీటిని నింపేందుకు శాశ్వత ప్రణాళికలను తయారు చేసి చెరువులను నీటితో నింపి ఇక్కడి ప్రాంతానికి రైతులకు సాగునీటిని అందించేందుకు శాశ్వత ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రవికాంత్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ నారాయణరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెంకటేష్ యాదవ్, పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



జయభేరి, తుర్కపల్లి, మే 18 :

తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో లెంకల గీతారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల హాజరు రిజిస్టర్ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని కూలీలు ఉదయాన్నే వచ్చి త్వరగా పనులను పూర్తి చేసుకొని వెళ్లాలని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ రమేష్, పంచాయతీ కార్యదర్శి చిక్కుడు రోజా, ఫీల్డ్ అసిస్టెంట్ పాంగల కరుణాకర్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ఐదో వార్డులోని బంజారా కాలనీ ప్రాంతంలో ఇళ్ల మధ్య పెరిగిన కంప చెట్లు తొలగింపు



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ ఐదో వార్డులోని బంజారా కాలనీ ప్రాంతంలో ఇళ్ల మధ్య పెరిగిన కంప చెట్ల వల్ల స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండటాన్ని గమనించిన ఐదో వార్డు కౌన్సిలర్ శ్రీమతి శ్రీకన్య సేవనాయక్ కౌన్సిలర్ శ్రీకన్య సేవియా నాయక్ ఆధ్వర్యంలో ఈరోజు జేసీబీ సహాయంతో కంప చెట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ఐదో వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.



## అభివృద్ధి పదంలో 18 వ వార్డు

జయభేరి, దేవరకొండ :

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్న కౌన్సిలర్ వీరమోని అంజి గౌడ్ అభివృద్ధి లో ఆదర్శ వార్డుగా మారుస్తా కౌన్సిలర్ అంజి గౌడ్ దేవరకొండ 18 వ వార్డులో సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని అన్నారు సోమవారం దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 18 వ వార్డులో పారిశుద్ధ్యం పనులను ఇండ్ల మధ్యలో ఉన్న కంప చెట్లను తొలగించే కార్యక్రమం నిర్వహించినారు ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ అభివృద్ధిలో 18 వ వార్డు ను మారుస్తా అని ఆయన అన్నారు పారిశుద్ధ నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు వార్డు ప్రజలు కౌన్సిలర్ వీరమోని అంజి గౌడ్ ను అభినందించినారు.

## యోగ.. 2K రన్




జయభేరి, దేవరకొండ :

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో నాడు ఫిట్ ఆక్టివ్ తెలంగాణ ప్రోగ్రాం లో భాగంగా యోగ మరియు 2K రన్ దేవరకొండ మునిసిపల్ మండల పరిధిలో నిర్వహించడం జరిగింది. దేవరకొండ ఖిల్లా పార్కు నుండి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు 2K రన్ నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, మునిసిపల్ మండల పరిధిలోని వివిధ అధికారులు యూత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేష్ MPDO డానియల్, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు NVT, CDPO చంద్రకళ, MEO మాతృనాయక్, MEO రవి, అంజయ్య, నరసింహ ,PD లు J చంద్రయ్య, రంగనాయక్, తస్లీమ్ ,ఈద్దయ్య ,వెంకట తండా సర్పంచ్ బీముడు, కౌన్సిలర్ సాయి, మున్సిపల్ శానిటర్ ఇన్స్పెక్టర్ శంకర్ గౌడ్, యాదయ్య, శ్రీను, బేస్బాల్ ప్లేయర్ మౌనిక, PET చరణ్, రామకృష్ణ ,పూజ ,అక్షర, మౌనిక, రాకేష్ ,ఎక్సైజ్ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, అంగన్వాడి సిబ్బంది, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, క్రీడాకారులు, కళాకారులు, నియోజకవర్గ ప్రజలు , కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు. దేవరకొండ నియోజకవర్గం లో ఇండోర్ అవుట్ డోర్ స్టేడియాలు త్వరలో అందుబాటులోకి వస్తే క్రీడాకారుల భవిష్యత్తు బాగుంటుంది ఎన్విటి తెలియజేసినారు.

## ఏపీలో కొత్త పెన్షన్ల మంజూరు, ముహూర్తం ఫిక్స్

జయభేరి, అమరావతి :

ఏపీ ప్రభుత్వం కొత్త పింఛన్లపై కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో టీడీపీజనసేనబీజేపీ కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయనుంది. వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు సహా అర్హులైన వారందరికీ పింఛన్లు అందించనుంది. ఇప్పటివరకు పింఛన్ రాని అర్హులు త్వరలో ఆన్లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని.., గత ప్రభుత్వంలో తొలగించిన పింఛన్ల సమస్యలను కూడా పరిష్కరిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు

# సైకిలెక్కిన బీర్ల అయిలన్న

- ఇంధన పొదుపు కోసం 27 కిలో మీటర్లు ప్రయాణం
- కార్లు ప్రక్కన పెట్టి సైకిల్ పై పిల్డ్ విజిట్
- యాదగిరిగుట్ట నుంచి ఆలేరు వరకు షాకింగ్ రైడ్
- ఎండల వేడిలోనూ రైతు సమస్యలపై దృష్టి కొనుగోలు కేంద్రాల సందర్శన,రైతులతో మాటా ముచ్చట



జయభేరి, యాదగిరిగుట్ట, మే 18 :

పెట్రోల్ డీజిల్ వంటి ఇంధన ధరలు అమాంతంగా పెరిగాయి..మోడీ పాలనలో ఇంధన ఖర్చులు అవసరం లేని ప్రత్యామ్నాయ రవాణాలకు సైకిల్ పై తిరగాల్సిన దుస్థితి ప్రజలకు ఏర్పడింది. ఇంధన ధరల పెరుగుదలతో ఆ ప్రభావం మార్కెట్ లో పడింది. ఫలితంగా సరుకుల ధరలు పెరుగుతున్నాయి. ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. అంటూ తనదైన శైలిలో సైకిల్ పై పర్యటించి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కేంద్ర ప్రభుత్వ నిర్వాకాన్ని ఎండగట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఒక్క తొలి రోజే సైకిల్ పైన 27 కిలోమీటర్లు పర్యటించి వినూత్న నిరసన తెలిపారు. యాదగిరిగుట్ట నుండి ఆలేరు వరకు సోమవారం ఉదయం 6 గంటలకు యాదగిరిగుట్టలోని తన నివాస గృహం నుంచి సైకిల్ పై బయలుదేరి యాదగిరిపల్లివంగపల్లిరామాజీపేటపెద్ద కందుకూరుచిన్న కందుకూరు బాహుపేట తదితర గ్రామాల మీదుగా ప్రయాణిస్తూ ఆలేరు మార్కెట్ యార్డు సహా మొత్తం తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు,రవాణా, హమాలీల కొరత,లారీల అందుబాటు వంటి అంశాలపై ఆరా తీశారు.

### నెల రోజులపాటు ఎలక్ట్రిక్ స్కూటీలపైనే...

ఇంధన ధరల పెరుగుదల వల్ల రైతులు, కార్మికులు, పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ఎందుకు నిరసనగా వచ్చే నెల రోజుల పాటు ఆలేరు నియోజకవర్గ పర్యటనలలో అధికారిక వాహనాలు, ఎస్కార్ట్ వాహనాలను వినియోగించబోనని.. కేవలం ఎలక్ట్రిక్ స్కూటీల ద్వారానే ప్రజల కోసం,ప్రజా సమస్యల పరిష్కారం కోసం పర్యటిస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సంచలన ప్రకటన చేశారు. ఆయన వెంట పుష్పాల నరసింహులు,కల్లేపల్లి శ్రీశైలం, ఎరుకల హేమేందర్, ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, బూడిద మధు,గౌలికార్ రాజేష్,బరిగే రామచందర్, సలాం,బందారపు బిక్షపతి, కౌకుంట్ల బాల్ రెడ్డి, చీర శ్రీశైలం,గుడ్ల నరేష్,లకన్ సహా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు వెళ్లారు.

# క్రీడలకు ప్రోత్సాహం ఏది..?

- నరసింహులపేట 2కే రన్ కు ప్రజల భాగస్వామ్యం కరువు
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

జయభేరి, నర్సింహులపేట :



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో 99రోజుల ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా.. 2కె రన్ మారథాన్ ను సోమవారం మండల పంచాయతీ అధికారి కిన్నర యాకయ్య ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి జయపురం క్రాస్ రోడ్ వరకు మారథాన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ రమేష్ బాబు,మండల పంచాయతీ అధికారి కిన్నర యాకయ్య మాట్లాడుతూ.. నేటి నుంచి 23వ తేదీ వరకు యువజన క్రీడల వారోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. అందులో భాగంగా.. ఆరోగ్యకరమైన జీవన శైలి,క్రీడలపై అవగాహన కోసం జిల్లాలు,మండలాల వారీగా 2కే రన్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

### కానరాని ప్రజల భాగస్వామ్యం

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా యువజన వారోత్సవాలు నిర్వహించాలని పిలుపునిస్తే,నేడు మండలంలో జరిగిన 2కే రన్ ప్రజల భాగస్వామ్యం లేక వెల వెల బోసి పోయింది.స్థానిక ఎస్ఐ,ఇద్దరు అధికారులు ,మరో నలుగురు ఉద్యోగులు,పంచాయతీ సిబ్బంది, ఒకరిద్దరు సర్పంచులు,ఒకరిద్దరు వార్డు సభ్యులు,మరో నలుగురు కాంగ్రెస్ మండల కాంగ్రెస్ నాయకులతో తూతూ మంత్రంగా నిర్వహించడం పట్ల కొంత మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.యువజన ఉత్సవాల్లో యువకులు లేకపోవటం పలు విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్ బాబు,మండల పంచాయతీ అధికారి కిన్నెర యాకయ్య,ఎస్ఐ వెంకన్న,సర్పంచ్ లు పెదమాముల యాకయ్య, గూగులోత్ రాజేందర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్,ఎస్టీ సెల్ అధ్యక్షుడు దస్రు నాయక్, వైద్య సిబ్బంది అన్వేష్,వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

## మజ్జిగ పంపిణీ తో పేదల దాహార్తిని తీర్చడం అభినందనీయం

- కే ఎంపీ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవలు అభినందనీయం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఊట్కూరి వేమన్ రెడ్డి

జయభేరి, కొండమల్లేపల్లి :




కొండమల్లేపల్లి పట్టణంలో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో దాతల సహకారంతో ప్రతిరోజు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణానికి చెందిన ధనలక్ష్మి ట్రేడర్స్ యజమాని బండారు శ్రీకాంత్ చలివేంద్రానికి 100 కేజీల పెరుగు వితరణ చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీకాంత్ ను ఘనంగా సన్మానించారు. ఎండలు రోజురోజుకు మండుతుండడంతో మజ్జిగ పంపిణీ వద్ద ప్రజల రద్దీ పెరుగుతూ ఉంది. దీనికి తగ్గట్టు దాతలు ముందుకు వచ్చి ప్రతిరోజు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయం. కే ఎంపీ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవలు విస్తరించాలని ఈ సందర్భంగా వేమన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కేఎంపి ఎల్ప్ హాండ్స్ నిర్వాహకులు ఏరుకొండ రాము, కూన భానుచందర్,దాచేపల్లి నరేందర్, అల్లంపల్లి విజయ్, పి సైదులు, అందుగుల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- వరి ధాన్యం , మొక్కజొన్న సేకరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి
- రైస్ మిల్లర్లు, లారీ యజమానులు ప్రభుత్వానికి సహకరించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్




**జయభేరి, కరీంనగర్ :**


కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో వరి ధాన్యం, మొక్కజొన్న సేకరణలో జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, రాష్ట్ర లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, లారీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటికే ముఖ్యమంత్రి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అవసరమైన సూచనలు చేశారని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరిగేలా మొత్తం అధికార యంత్రాంగం కృషి చేస్తోందని, అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 314 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటికే సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చినట్లు వెల్లడించారు.
ఇప్పటివరకు జిల్లాలో 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని, మిగిలిన 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన సేకరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన ధాన్యానికి సంబంధించి 63 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని, రైతుల ఖాతాల్లో బ్యాంకుల ద్వారా రూ.237.39 కోట్లు జమ చేసినట్లు తెలిపారు.
ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జిల్లా అధికార యంత్రాంగం సంపూర్ణ సహకారం అందిస్తోందని, రైస్ మిల్లర్లు, లారీ యజమానులు కూడా బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కోరారు. ధాన్యం రవాణాకు అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలని సూచించారు.
కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు ధాన్యం తీసుకుని కొనుగోలు కేంద్రాలకు వచ్చి రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు రాకూడదన్నారు. హమాలీల కొరత కారణంగా కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.
పీఏసీఎస్ కేంద్రాల్లో సిబ్బంది కొరత కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొంటూ, అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# కవరే, సామాజిక సందేశం

- వృత్తిని సమాజ హితానికి ఆయుధంగా మలుచుకున్న ఏశాల కృష్ణ
- పాస్ ఫోటో కవర్లపై ప్రాణహిత ఫోటో నినాదాల ముద్రణ
- 33 ఏళ్లుగా ఫోటోగ్రఫీలో రాణిస్తూనే వినూత్న అవగాహన

**జయభేరి, తుర్కపల్లి, మే 18 :**

"ఒక ఫోటో వెయ్యి పదాలతో సమానం" అన్నది పాత మాట, కానీ ఇక్కడ ఒక చిన్న ఫోటో కవరు వెయ్యి ప్రాణాలను కాపాడే అంత గొప్ప సందేశ వాహకంగా మారుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన ఫోటోగ్రాఫర్ ఏశాల కృష్ణ తన వృత్తిని కేవలం జీవనోపాధిగానే కాకుండా, సామాజిక మార్పు కోసం ఒక ఆయుధంగా మలుచుకుంటూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. గత 33 ఏళ్లుగా ఈ రంగంలో కొనసాగుతున్న ఆయన, ఫోటోలు తీసుకోవడానికి వచ్చే కస్టమర్లకు ఇచ్చే పాస్ ఫోటో కవర్లపై సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కరోనా






వేళ 'కవర్' తో వినూత్న ఆలోచన కరోనా మహమ్మారి లోకాన్ని అతలాకుతలం చేస్తున్న సమయంలో కృష్ణ ఒక వినూత్న ఆలోచన చేశారు. "బతికి బట్టకట్టాలంటే. మూతికి బట్ట కట్టాల్సిందే" అనే స్లోగన్‌తో పాస్ ఫోటో కవర్లపై మాస్కులు, శానిటైజర్ల ప్రాముఖ్యతను ముద్రించడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయన సామాజిక ప్రయాణం నిరంతరాయంగా కొనసాగుతోంది.

**బహుముఖ సందేశాలు...**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా "తలమీదే రక్షణ మీదే" అంటూ హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించడం, "రక్తదానం చేయండి. ప్రాణ దాతలుగా నిలవండి" అంటూ రక్తదానం మరియు అవయవ దానంపై చైతన్యం కల్పించడం వంటివి ఆయన నిత్యకృత్యంగా మార్చుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా "చేతి సంచితో బజారుకు వెళ్దాం ప్లాస్టిక్‌ను తరిమేద్దాం" అంటూ పిలుపునివ్వడంతో పాటు, ధూమపానం, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై కవర్లపై హెచ్చరికలను ముద్రిస్తూ యువతను మేల్కొల్పుతున్నారు.

**కష్టాలున్నా వెనకడుగు వేయని వైనం**

సాధారణ పేపర్‌పై ప్రింటింగ్ సులభమే కానీ, అత్యంత చిన్న సైజులో ఉండే పాస్ ఫోటో కవర్లపై ప్రింట్ వెయ్యాలంటే రిస్క్ తో కూడుకున్న పని ఇందుకోసం ఆయన ప్రత్యేకంగా ఒక ప్రింటర్‌ను కొనుగోలు చేశారు. ప్రింట్ వేసే సమయంలో పేపర్లు జామ్ అవుతున్నా, సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నా లెక్కచేయకుండా 2020 నుంచి పాస్ ఫోటో కవర్లపై ముద్రిస్తూ తన సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు.

**వృత్తిపై గౌరవం.. యువతకు స్ఫూర్తి**

స్మార్ట్ ఫోన్ల హవాలో ఫోటోగ్రఫీ రంగం ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రతి క్షణాన్ని మధుర జ్ఞాపకంగా మార్చేది ఒక్క ఫోటో మాత్రమేనని కృష్ణ గట్టిగా నమ్ముతారు. అందుకే ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే, భారత తొలి మహిళా ఫోటో జర్నలిస్ట్ హోమయి వ్యారావాలా చిత్రపటాలను సైతం తన కవర్లపై ముద్రిస్తూ వృత్తి పట్ల తనకున్న అంకితభావాన్ని చాటుకుంటున్నారు. ఎందరో యువతకు ఈ పనిలో శిక్షణనిచ్చి వారి ఉపాధికి బాటలు వేశారు. ఒక సామాన్య ఫోటోగ్రాఫర్ తలచుకుంటే సమాజంలో ఎంతటి మార్పు తీసుకురావచ్చో చెప్పడానికి ఏశాల కృష్ణ ఒక నిలువెత్తు నిదర్శనం.

# మెట్రో రైళ్లకు కొత్త కోచ్ లు

**జయభేరి, హైదరాబాద్, మే 18 :**

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు శుభవార్త. రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రయాణికులకు నిల్చొని ప్రయాణం చేసే బాధ తప్పనుంది. హాయిగా కూర్చొని ప్రయాణం చేయవచ్చు. ప్రభుత్వం కొత్త కోచ్‌ల కొనుగోలుపై కీలక ముందడుగు వేసింది. ఇందుకోసం ఒప్పందం కుదుర్చుకోనుంది.
హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు తీపి కబురు అందింది. త్వరలో ప్రత్యేక కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం తిరుగుతున్న మెట్రో రైళ్లల్లో కొత్త కోచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న రైళ్లల్లోని కోచ్‌లు ప్రయాణికుల రద్దీ అవసరాలకు తగ్గట్లు లేవు. రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు నిల్చొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉండటంతో కనీసం నిల్చొని ప్రయాణం చేయడానికి కూడా ఖాళీ ఉండటం లేదు.
ఈ క్రమంలో మెట్రో రైళ్లల్లో కొత్త కోచ్‌లు తీసుకురావాలని అధికారులు ఎప్పటినుంచో భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పుడు మరో ముందడుగు పడింది. ఇటీవల మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో కొత్త కోచ్‌ల ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. ఇందుకు వేగంగా చర్యలు చేపడుతున్నారు. దాదాపు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. కొత్త కోచ్‌ల కోసం బెంగళూరుకు చెందిన భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్‌తో చర్చలు జరుపుతోంది. ఆ సంస్థ కొత్త కోచ్‌లను సరఫరా చేయనుండగా.. త్వరలో ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనుంది. త్వరలోనే అధికారికంగా ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయని తెలుస్తోంది.



**15 నెలల్లోనే కొత్త కోచ్‌లు సరఫరా**

ప్రభుత్వం ఆర్డర్ ఇస్తే.. 15 నెలల్లోనే కొత్త కోచ్‌లను బీఈఎంఎల్ సరఫరా చేయనుంది. ప్రస్తుతం నగరంలోని మూడు కారిడార్లలో 56 మెట్రో రైళ్లు సర్వీసులు అందిస్తున్నాయి. ఒక్కో రైలుకు 3 కోచ్‌లు మాత్రమే ఉండగా.. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఇవి సరిపోవడం లేదు. దీంతో కొత్త కోచ్‌లను ఏర్పాటు చేస్తే ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. ప్రయాణికులు నిల్చొని ప్రయాణం చేసే సమస్య కాస్త తగ్గుతుంది. రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడమే కాకుండా ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యం పెరుగుతుంది. దీని వల్ల మెట్రో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందనుంది.



## కాజ్ వే నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మదనాపురం మండలం దంతనూరు మరియు శంకరంపేట గ్రామాల మధ్యలో ఉన్న వాగుపై దాదాపు 1 కోటి రూపాయల నిధులతో నిర్మించే బ్రిడ్జ్ (కాజ్ వే) నిర్మాణానికి సోమవారం నిర్వహించిన భూమి పూజలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరఫున నూతన వస్త్రాలు అందజేసి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు వివాహ శుభ కార్యాలలో పాల్గొని నూతన వధూవరులను ఎమ్మెల్యే జిఎంఆర్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి


- అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశం



**జయభేరి, దేవరకద్ర :**

తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని అధికారులను మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశించారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి సంబంధించిన డిజైన్ను ఎమ్మెల్యే జీఎంఆర్ పరిశీలించారు. అనంతరం స్థానిక పిఎసిఎస్ కార్యాలయంలో వరి కొనుగోలుకు సంబంధించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని గుత్తేదార్లతో ఎమ్మెల్యే మాట్లాడారు. అలాగే లారీలను సకాలంలో ఏర్పాటు చేయాలని కూడా ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సతీమణి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం బస్వాపూర్ లో సోమవారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి జి.కవిత మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరఫున ఆమె నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూనేటి అంజిల్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చౌడమ్మ తల్లికి ఎమ్మెల్యే జిఎంఆర్ పూజలు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామపంచాయతీ గోపన్నపల్లి లో సోమవారం చౌడమ్మ తల్లి ఉత్సవాలలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



## దమగ్నాపూర్ లో కోఆర్డినేషన్ సమావేశం

**జయభేరి, దేవరకద్ర :**


మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ లో సోమవారం కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ ర్యాంపు ప్రాజెక్టు కింద మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి పరిశ్రమల ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి జి.కవితా మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఉద్దేశించి కవిత మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, కార్యక్రమ నిర్వహకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లిన ఆర్యవైశ్యులు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి చెందిన ఆర్యవైశ్యులు నేపాల్ ముక్తినాథ్ ఆధ్యాత్మిక ప్రత్యేక యాత్రకు బయలుదేరి వెళ్లారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి ఆధ్వర్యంలో దాదాపు 15 మంది ఆర్యవైశ్యులు ఈ యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా దాదాపు పది రోజులపాటు ఆయా దేవాలయాలను వారు దర్శించి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

## బాధితుడ్ని పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం గుడిబండలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్ రెడ్డిని సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ రెడ్డి గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్ గుడిబండ గ్రామానికి వెళ్లి బాధితుడు శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# చెన్నైకి చెక్.. ప్లేఆఫ్స్‌కు రైజర్స్

సీఎస్కే ఇచ్చిన 181 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. హెన్రిచ్ క్లాసెన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 47) కూడా రాణించాడు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సీఎస్కే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. డెవాల్డ్ బ్రెవిస్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 44), కార్తీక్ శర్మ (19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించారు. కమిన్స్ మూడు, సాకిబ్ హుస్సేన్ (2/34) రెండు వికెట్లు తీశారు. ఇషాన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్నాడు.

సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్ అద్భుతమైన పేస్, లెంగ్త్‌తో కీలక సమయాల్లో వికెట్లు తీసినా.. బ్యాటర్ల సమష్టి కృషితో సీఎస్కే మంచి స్కోరే చేసింది. ఓపెనర్ సంజూ శాంసన్ (27) చెన్నైకి మెరుపు లాంటి ఆరంభాన్ని ఇచ్చాడు. నితీశ్‌రెడ్డి వేసిన తొలి ఓవర్లోనే సిక్స్, రెండు ఫోర్లు, ఆపై ప్రఫుల్ హింగే బౌలింగ్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెపాక్ స్టేడియాన్ని హోరెత్తించాడు.

అయితే, మూడో ఓవర్లోనే రంగంలోకి దిగిన కమిన్స్.. బుల్లెట్ లాంటి బంతితో శాంసన్‌ను ఔట్ చేసి రైజర్స్‌కు తొలి బ్రేక్ ఇచ్చాడు.యంగ్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ (13) కమిన్స్ బౌలింగ్‌లోనే వరుసగా రెండు సిక్సర్లు బాదినప్పటికీ, సాకిబ్ వేసిన స్లో బాల్‌కు క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కెప్టెన్ గైక్వాడ్ (21 బంతుల్లో 15) ఒక్క బౌండరీ కొట్టకపోయినా.. కార్తీక్ శర్మ ధాటిగా బ్యాటింగ్ చేశాడు. హింగే బౌలింగ్‌లో 4,6, కొట్టిన అతను గైక్వాడ్‌తో మూడో వికెట్‌కు 42 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. కానీ, పదో ఓవర్లో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన కమిన్స్ ఈ కుర్రాడిని పెవిలియన్‌కు పంపాడు. ఆ వెంటనే గైక్వాడ్‌ను కూడా ఓ పవర్‌ఫుల్ బౌన్సర్‌తో ఔట్ చేయడంతో 100/4తో చెన్నై ఇబ్బందుల్లో పడింది.

ఈ దశలో శివమ్ దూబే (26)తో కలిసి బ్రెవిస్ జట్టును ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకున్నాడు. నితీశ్‌ను టార్గెట్ చేసి 4, 4, 6 కొట్టిన అతను కమిన్స్ బౌలింగ్‌లో 6,4తో అలరించాడు.ఈషాన్ వేసిన 18వ ఓవర్లో మరో సిక్స్ కొట్టిన అతను వెంటనే క్లీన్‌బౌల్డ్ అవ్వడంతో ఐదో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివరి రెండు ఓవర్లలో దూబే, ప్రశాంత్ వీర్ (11)ను కట్టడి చేసిన రైజర్స్ బౌలర్లు చెన్నై భారీ స్కోరును అడ్డుకున్నారు.

లక్ష్య ఛేదనను సన్‌రైజర్స్ నింపాదిగా ఆరంభించినా తర్వాత దూకుడు చూపెట్టింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (6) మూడో ఓవర్లో ముకేశ్ చౌదరికి రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిరాశపరచగా.. తొలి ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (26) తనదైన స్టయిల్లో ఆడలేకపోయాడు. దాంతో వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ బాధ్యత తీసుకున్నాడు.

స్పెన్సర్ జాన్సన్ వేసిన నాలుగో ఓవర్లో మూడు ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన అతను అన్షుల్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో పవర్‌ప్లేను 45/1తో ముగించాడు. స్పిన్నర్ నూర్ బౌలింగ్‌లో సిక్స్‌తో వేగం పెంచే ప్రయత్నం చేసిన అభి.. మరో స్పిన్నర్ అకీల్ హుస్సేన్‌కు వికెట్‌కు ఇచ్చుకున్నాడు. దాంతో రైజర్స్ 56/2తో ఇబ్బందుల్లో పడేలా కనిపించింది. అయితే, అప్పటికే క్రీజులో కుదురుకున్న ఇషాన్‌కు తోడైన క్లాసెన్ తనదైన శైలిలో విజృంభించాడు.

స్పిన్నర్లు అకీల్, నూర్‌ను టార్గెట్ చేసి రెండేసి ఫోర్లు, సిక్సర్లతో ఎదురుదాడికి దిగాడు. అటువైపు ఇషాన్ కూడా క్రమం తప్పకుండా బౌండరీలు కొట్టడంతో మ్యాచ్ రైజర్స్ వైపు మొగ్గింది. అర్ధ శతకం ముంగిట నూర్ వేసిన 15వ ఓవర్లో శాంసన్ మెరుపు స్టంపింగ్‌కు క్లాసెన్ పెవిలియన్ చేరడంతో మూడో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. దాంతో సీఎస్కే మళ్లీ రేసులోకి వచ్చేలా కనిపించింది. కానీ, కిషన్ అస్సలు తగ్గలేదు. 37 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్న అతను.. నితీశ్ రెడ్డి (11) తోడుగా లక్ష్యాన్ని కరిగించాడు. 18 బంతుల్లో రైజర్స్‌కు 28 పరుగులు అవసరమైన దశలో 18 ఓవర్లో నితీశ్‌ను ఔట్ చేసిన ముకేశ్ చెన్నై శిబిరంలో ఆశలు రేపాడు. కానీ, ఆ జట్టుకు ఎలాంటి చాన్స్ ఇవ్వని ఇషాన్ అదే ఓవర్లో 4,6తో రైజర్స్ విజయం ఖాయం చేశాడు. ఆపై కాంబోజ్ బౌలింగ్‌లో ఇషాన్ ఔటైనా సలీల్ (10 నాటౌట్), స్మరన్ (5 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు.

8 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్ చేరడం ఇది ఎనిమిదోసారి 1 ఒక ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ తొలిసారి సీఎస్కేతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచింది.

**సంక్షిప్త స్కోర్లు**

చెన్నై: 20 ఓవర్లలో 180/7 (బ్రెవిస్ 44, కార్తీక్ శర్మ 32, కమిన్స్ 3/28, సాకిబ్ హుస్సేన్ (2/34);

సన్‌రైజర్స్ : 19 ఓవర్లలో 181/5 (ఇషాన్ 70, క్లాసెన్ 47, ముకేశ్ 2/36)




# ముష్ఫికర్ రికార్డు శతకం..

పాకిస్థాన్‌తో రెండో టెస్టులో బంగ్లాదేశ్ పట్టుబిగించింది. వెటరన్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ (137) బంగ్లా తరఫున అత్యధికంగా 14వ శతకంతో విజృంభించడంతోపాక్ ముందు 437 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. పాకిస్థాన్‌తో రెండో టెస్టులో బంగ్లాదేశ్ పట్టుబిగించింది. వెటరన్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ (137) బంగ్లా తరఫున అత్యధికంగా 14వ శతకంతో విజృంభించడంతోపాక్ ముందు 437 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓవర్‌నైట్ స్కోరు 110/3తో మూడో రోజు సోమవారం ఆట కొనసాగించిన బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ కెప్టెన్ నజ్ముల్ శాంటో(15) నిరాశపర్చగా..ముష్ఫికర్ పాక్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ కీలక ఇన్నింగ్స్‌తో కదంతొక్కాడు. లిటన్‌దాస్(69)తో కలిసి ఐదో వికెట్‌కు 123 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. పాక్ బౌలర్లలో ఖుర్రామ్ షెహజాద్(4/86), సాజిద్‌ఖాన్(3/126) రాణించారు. భారీ లక్ష్య ఛేదనలో మూడో రోజు చివరకు 2 ఓవర్లలో పాక్ పరుగుల ఖాతా తెరవలేదు.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం.

శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి.ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్


సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.





# హీరోయిన్ పై రామ్ పొగడ్తలు..

హీరోయిన్ జాన్వీ కపూర్ డెడికేషన్ గురించి రామ్ చరణ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "జాన్వీ లాంటి కష్టపడే మనస్తత్వం ఉన్న నటిని నేను చూడలేదు. మేము ఒక సాంగ్ షూట్ చేస్తున్నప్పుడు నేను కేవలం సెట్స్‌లోనే స్టెప్స్ నేర్చుకుని డాన్స్ చేశాను. కానీ జాన్వీ ముంబైలోనే ఆ స్టెప్స్‌ను 100 సార్లు ప్రాక్టీస్ చేసి నాకంటే అద్భుతంగా చేసింది. ఆమె నిజంగా ఒక టాలెంటెడ్ హీరోయిన్" అని చరణ్ నవ్వుతూ చెప్పారు. అంతేకాకుండా తన తండ్రి మెగాస్టార్ చిరంజీవి, అతిలోక సుందరి శ్రీదేవిల కాంబినేషన్ ఎంతటి సంచలనమో.. ఇప్పుడు తామిద్దరి కాంబినేషన్ కూడా ప్రేక్షకులను, అభిమానులను ఎంతమాత్రం నిరాశపరచదని ధీమా వ్యక్తం చేశారు. ఈ సినిమా శారీరకంగా తనకు ఎంతో సవాలుగా నిలిచిందని, నిజమైన కుస్తీ పహిల్వాన్లతో షూటింగ్ చేయడం వల్ల తనకు చిన్న గాయాలైనా, అవన్నీ సినిమా కోసం విలువైనవని చరణ్ పేర్కొన్నారు. "ఇలాంటి అద్భుతమైన కథలు దశాబ్దానికి ఒకసారి మాత్రమే వస్తాయి. నా కెరీర్‌లో 'మగధీర', 'రంగస్థలం', 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాల తర్వాత నా లైబ్రరీలో ఎప్పటికీ దాచుకునే అంతటి గొప్ప ఇన్స్పిరేషనల్ కథ 'పెద్ది'" అని తన తండ్రి చిరంజీవి కూడా చెప్పినట్లు రామ్ చరణ్ ఎమోషనల్ అయ్యారు. ఈ వేడుకలో రామ్ చరణ్, జాన్వీ కపూర్ కలిసి స్టేజ్ పైన 'చికిరి చికిరి' సాంగ్‌కు స్టెప్పులేసి సందడి చేశారు.



# వినోద ప్రధానంగా 'సుధీర్ జోకర్'

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సుధీర్ జోకర్'. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. బిగ్‌బాస్ ఫేమ్ అయేషా కథానాయికగా పరిచయమవుతున్నది. సోమవారం సుడిగాలి సుధీర్ పుట్టినరోజు సందర్భంగా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సుడిగాలి సుధీర్ ప్లేయింగ్ కార్డ్స్‌ను పట్టుకొని కనిపిస్తున్నారు. ఇది మైండ్‌గేమ్ ప్రధానంగా సాగే వినోదాత్మక చిత్రమని, సుడిగాలి సుధీర్ పాత్ర నవ్యరీతిలో సాగుతుందని మేకర్స్ తెలిపారు. అభిరామి, మురళీశర్మ, అజయ్‌ఘోష్, రమేష్ ఇందిరా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అహ్మద్ షరీఫ్, సంగీతం: లియోన్ జేమ్స్, ప్రొడక్షన్ డిజైనర్: విఠల్ కోసనం, రచనదర్శకత్వం: పీఎస్ సునీల్ పుప్పాల.

# బాలకృష్ణ కొత్త అవతారం?



ప్రస్తుతం మలినేని గోపీచంద్ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు బాలకృష్ణ. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే 40శాతం పూర్తయింది. దసరాకు సినిమాను విడుదల చేయాలనే సంకల్పంతో మేకర్స్ ముందుకెళ్తున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమాతో పాటు సమాంతరంగా కొరటాల శివ సినిమాను కూడా బాలకృష్ణ చేయబోతున్న విషయం తెలిసిందే. ఆగస్టులో ఈ సినిమా షూటింగ్ మొదలు కానున్నది. ముందుగా యాక్షన్ సీక్వెన్స్‌తో షూట్‌ని మొదలుపెట్టనున్నారు కొరటాల. ఈ యాక్షన్ సీక్వెన్స్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో వస్తుందని సమాచారం. ఈ ఎపిసోడ్‌లో బాలకృష్ణ లుక్‌ని కొత్తగా ప్లాన్ చేశారట కొరటాల. ఇందులో భాగంగా బాలకృష్ణ హెయిర్ స్టైల్‌పై ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఈ బాధ్యతను ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హకీమ్‌కి అప్పగించారు. ఆయన పాత్రకు తగ్గట్టుగా ఓ కొత్త హెయిర్ స్టైల్‌ని బాలయ్య కోసం డిజైన్ చేస్తున్నారట. హెయిర్ స్టైల్‌తో పాటు, బాలకృష్ణ డ్రెస్సింగ్ స్టైల్ కూడా ఈ ఎపిసోడ్‌లో భిన్నంగా ఉంటుందని వినికిడి. మొత్తంగా అల్ట్రా స్టైలిష్‌గా, పక్కా మాస్ అవతారంలో బాలకృష్ణను కొరటాల చూపించబోతున్నారు. ఈ సినిమాలో కుటుంబ భావోద్వేగాలు సైతం బలంగా ఉంటాయని తెలిసింది. సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు తెలియాల్సివుంది.

# 'గోదారి గట్టుపైన' మూవీ నాకు కొత్త ఆడియన్స్‌ను పరిచయం చేసింది



యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ సమ్మర్ బ్లాక్ బస్టర్ 'గోదారి గట్టుపైన. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించారు. మే 8న వరల్డ్‌వైడ్ రిలీజ్ అయిన ఈ చిత్రం సమ్మర్ కూల్ ఎంటర్టైనర్ గా అలరించి థియేటర్స్ లో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది.. ఈ సందర్భంగా మేకర్స్ థాంక్స్ మీట్ నిర్వహించారు. థ్యాంక్స్ మీట్‌లో హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. మా కంటెంట్‌ను ఎంతో స్ట్రాంగ్‌గా సపోర్ట్ చేస్తున్న మీడియాకు థ్యాంక్స్. మూడేళ్ల తర్వాత నా సినిమా వస్తోంది. 'ఎవరైనా టికెట్ కొంటారా?' అని మా ఫ్రెండ్స్ అన్నప్పుడు నా మనసు కాస్త కళుక్ మంది. కానీ మేము థియేటర్లు విజిట్ చేస్తూ పల్లెటూర్లలో తిరిగినప్పుడు థియేటర్లలో కనిపించిన ఎనర్జీ మామూలుగా లేదు.

ఫ్యామిలీలతో థియేటర్లు కలకలలాడడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. 'మేం ఫేమస్' సినిమాను యూత్ కనెక్ట్ చేసుకున్నారు. ఈ సినిమా నాకు కొత్త ఆడియన్స్‌ను పరిచయం చేసింది. ప్రతి ఇంట్లోకి తీసుకెళ్లింది. ఈ సందర్భంగా డైరెక్టర్ సుభాష్ చంద్రకి థ్యాంక్స్. ప్రేక్షకుల స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. 12వ రోజు కూడా హౌస్‌ఫుల్ రన్ తీసుకుందంటే అది నిర్మాత అభినవ్ వల్లే సాధ్యమైంది. ప్రతి యంగ్ ఫిల్మ్‌మేకర్‌కు అభినవ్ లాంటి నిర్మాత దొరకాలి. మాకు ఎంతో స్ఫూర్తినిస్తూ ఈ సినిమాను ముందుకు తీసుకెళ్లారు. సినిమాకు వచ్చిన ఫలితంతో చాలా ప్రశాంతంగా ఉన్నాను. నాకోసం కష్టపడ్డ నా ఫ్రెండ్స్ అందరికీ థ్యాంక్యూ. మా నటీనటులకు, టెక్నీషియన్స్‌కి పేరుపేరునా ధన్యవాదాలు. సినిమా ఇంకా థియేటర్లలో ఉంది. చూడని వాళ్లు తప్పకుండా వెళ్లి చూడాలని కోరుకుంటున్నాను. హీరోయిన్ నిధి ప్రదీప్ మాట్లాడుతూ.. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మాయ క్యారెక్టర్‌కు వస్తున్న రెస్పాన్స్ ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఇలాంటి మరిన్ని మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. సుమంత్ గారితో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్‌పీరియన్స్. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. టీమ్ అందరికీ ధన్యవాదాలు. మా సినిమాకు ఇంత మంచి స్పందన ఇచ్చిన ప్రేక్షకులకు మరొకసారి కృతజ్ఞతలు. నిర్మాత అభినవ్ రావు మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. మౌత్ టాక్‌తోనే ఇలాంటి సినిమాలు నిలబడతాయి. ప్రేక్షకులు ఇచ్చిన రెస్పాన్స్‌తో మేము చాలా హ్యాపీగా ఉన్నాం. ఇంకా సినిమా చూడని వారు మీ ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడండి.

# అవన్నీ రూమర్లే!

అచ్చ తెలుగందం శ్రీలీలకు యువతరంలో ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. అందుకే ఈ అమ్మడు విజయాలతో సంబంధం లేకుండా భారీ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. అదే సమయంలో గత కొంతకాలంగా ఈ భామ వ్యక్తిగత జీవితం గురించి రూమర్లు రావడం పరిపాటిగా మారింది. తాజాగా క్రికెటర్ తిలక్‌వర్మతో ఈ ఆమె డేటింగ్‌లో ఉందంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. గత డిసెంబర్‌లో వీరిద్దరూ తిరుమలను సందర్శించడం, ఆపై ముంబయిలో టీ20 మ్యాచ్‌ను తిలకించడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. తాజాగా వీటిపై శ్రీలీల తల్లి స్వర్ణలత స్పందించారు. ఇవన్నీ కేవలం పుకార్లేనని, వాటిలో ఎలాంటి వాస్తవం లేదని, ప్రస్తుతం శ్రీలీల కెరీర్ మీదనే దృష్టి పెట్టిందని వివరణ ఇచ్చారు. మరో ఐదేళ్ల తర్వాతే తన కూతురు పెళ్లి గురించి ఆలోచిస్తానని స్పష్టం చేశారు. గతంలో బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందనే ప్రచారం కూడా జరిగింది. ఈ వార్తలను కూడా స్వర్ణలత ఖండించారు. తానూ, కార్తిక్ ఆర్యన్ తల్లి ఇద్దరం గైనకాలజిస్టులం కావడంతో వృత్తిపరంగా కలుసుకొని అనేక విషయాలు మాట్లాడుకుంటామని, దీనిని కారణంగా చూపించి కార్తిక్ ఆర్యన్, శ్రీలీల మధ్య రిలేషన్‌షిప్ వార్తలను సృష్టించారని ఆమె అసహనం వ్యక్తం చేశారు.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**